## గండ్లవారిపల్లిలో గ్రామసభ నిర్వహణ -- మహిళల భద్రత, పోక్సో, సైబర్ భద్రతపై అవగాహన అర్బన్ సీఐ శివరాముడు

- మహిళల భద్రత, పోక్సో చట్టం, సైబర్ నేరాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై గ్రామస్తులకు అవగాహన కల్పించిన అధికారులు



**ముదిగుబ్బ,జూన్01.అక్షర టైమ్స్:-** ముదిగుబ్బ మండలంలోని గండ్లవారిపల్లి గ్రామంలో అర్బన్ సీఐ శివరాముడు గ్రామసభ నిర్వహించి గ్రామస్తులతో పలు ముఖ్యమైన సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలపై జరుగుతున్న నేరాలు, పిల్లల రక్షణకు సంబంధించిన పోక్సో చట్టం, సైబర్ భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో మహిళలపై జరిగే వేధింపులు, దాడులు వంటి ఘటనలను వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సీఐ శివరాముడు సూచించారు. అలాగే చిన్నారులపై లైంగిక వేధింపులు, దుర్వినియోగాన్ని అరికట్టేందుకు పోక్సో చట్టంలోని నిబంధనలను వివరించి, పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో అపరిచితుల ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింక్‌లు, ఓటీపీలు మరియు బ్యాంకు వివరాలను ఎవరికీ ఇవ్వకూడదని అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. అదేవిధంగా ట్రాఫిక్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనం నడుపుతున్నప్పుడు మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామస్తులు ఈ అవగాహన కార్యక్రమానికి మంచి స్పందన వ్యక్తం చేయగా, ఇటువంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని కోరారు. గ్రామంలో భద్రతా చైతన్యం పెంపొందించేందుకు ఈ గ్రామసభ ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు.

## పుట్టపర్తిలో అత్యాధునిక ఆధార్ సేవా కేంద్రం

- ఇక ఆధార్ సేవల కోసం ఇతర నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేదు
- కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎమ్మెల్యే సింధూర రెడ్డి,మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి





**పుట్టపర్తి,జూన్01.అక్షర టైమ్స్:** శ్రీ సత్యసాయి జిల్లా ప్రజలకు ఆధార్ సేవలను మరింత చేరువ చేసే దిశగా పుట్టపర్తిలో నూతనంగా ఏర్పాటు చేసిన యూఐడీఏఐ ఆధార్ సేవా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆధార్ నమోదు, మొబైల్ నంబర్ అనుసంధానం, చిరునామా మార్పు, బయోమెట్రిక్ అప్‌డేట్‌లు, పిల్లల ఆధార్ నమోదు వంటి అన్ని రకాల సేవలను ఒకే కేంద్రంలో వేగవంతంగా, పారదర్శకంగా అందించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. విజయవాడ, విశాఖపట్నం వంటి మహానగరాల్లో లభించే ఆధునిక డిజిటల్ సేవలు ఇకపై పుట్టపర్తిలోనే అందుబాటులో ఉండటం జిల్లాకు గర్వకారణమన్నారు.ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, గ్రామీణ ప్రాంత ప్రజలు ఆధార్ సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తొలగిపోతాయని చెప్పారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంలో భాగంగా యూఐడీఏఐ అధికారులు, బీఎల్ఎస్ ఇంటర్నేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ ప్రతినిధులు చేసిన కృషిని కలెక్టర్ అభినందించారు.ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ జిల్లా ప్రజలందరూ ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఆధార్ వివరాలను నవీకరించుకోవాలని సూచించారు. ప్రజలకు సౌకర్యవంతమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఆధార్ సేవా కేంద్రం ఏర్పాటుకు సహకరించిన అధికారులకు, సంబంధిత సంస్థల ప్రతినిధులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, ఆధార్ సేవా కేంద్రం సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఉదయం నుంచే పేదల ఇంటి వద్దకు పెన్షన్లు..

- సేవలో ముందున్న దేవేంద్ర గౌడ్
- ఓరువాయిలో సామాజిక భద్రతకు పెద్దపీట..



**నల్లచెరువు,జూన్01.అక్షర టైమ్స్:** పేదలు,వృద్ధులు, వికలాంగులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారి ఇంటి వద్దకే సామాజిక పెన్షన్లు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం సోమవారం నల్లచెరువు మండలం ఓరువాయి గ్రామంలో విజయవంతంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో బీసీ మండల అధ్యక్షులు కదిరిసాని దేవేంద్ర గౌడ్ ఉదయం నుంచే స్వయంగా పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. గ్రామంలోని వృద్ధులు, వితంతువులు, వికలాంగుల వద్దకు వెళ్లి పెన్షన్ అందజేస్తూ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ సకాలంలో అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు నిజమైన లబ్ధిదారులకు చేరడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. పెన్షన్ అందుకున్న వృద్ధులు, మహిళలు తమకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇంటి వద్దకే పెన్షన్ అందజేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల పట్ల సేవాభావంతో వ్యవహరిస్తున్న దేవేంద్ర గౌడ్‌ను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా దేవేంద్ర గౌడ్ మాట్లాడుతూ, “పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం. వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు పడకుండా ప్రతి నెలా పెన్షన్ సకాలంలో అందేలా కృషి చేస్తున్నాం. ప్రజా సేవే మా లక్ష్యం” అని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

## ఈ 10 వస్తువులు ఇతరులకు అస్సలు ఇవ్వకండి.. ఇస్తే ఏమౌతుందో తెలుసా..?



మన జీవితంలో కొన్ని వస్తువులు చాలా ప్రత్యేకంగా ఉంటాయి. ఇవి శక్తిని, అదృష్టాన్ని సూచిస్తాయి. అలాంటి వస్తువులను వేరొకరికి ఇవ్వడం వల్ల ఆ శక్తి మన నుండి పోతుందని నమ్మకం ఉంది. ఇది సంప్రదాయం మాత్రమే కాదు.. అనుభవంతో కూడిన జీవన జ్ఞానం. ఇప్పుడు అలాంటి 10 ముఖ్యమైన వస్తువుల గురించి తెలుసుకుందాం.

సింధూరం

సింధూరం ఒక వివాహిత స్త్రీకి గుర్తు. ఇది ఆమె సంసారానికి రక్షణగా భావించబడుతుంది. సింధూరాన్ని వేరొకరికి ఇవ్వడం వల్ల ఆమె వైవాహిక జీవితంలో కలహాలు లేదా దురదృష్టం వచ్చేందుకు అవకాశం ఉందని నమ్మకం ఉంది.

**మిగిలిపోయిన ఆహారం**

తినకుండా మిగిలిన ఆహారాన్ని వేరొకరికి ఇవ్వడం అనాగరికంగా భావించబడుతుంది. ఇది ఆరోగ్య సమస్యలతో పాటు ప్రతికూల శక్తులు ఇంట్లోకి రావడానికి కారణమవుతుందని చెప్పబడుతుంది.

**చీపుర్లు, శుభ్రత వస్తువులు**

చీపురును లక్ష్మిని సూచించే వస్తువుగా పరిగణిస్తారు. దానిని వేరొకరికి ఇవ్వడం డబ్బు నష్టానికి దారి తీస్తుంది. అలాగే ఇంట్లో శాంతి తగ్గిపోవచ్చు.

**చిరిగిన బట్టలు**

వాడిన, పాడైపోయిన బట్టలను ఇతరులకు ఇవ్వడం మంచిది కాదు. ముఖ్యంగా లోదుస్తులు, నైట్ డ్రెస్ వంటివి పూర్తిగా వ్యక్తిగతమైనవి. ఇవి ఇవ్వడం వల్ల మన శక్తి బదిలీ అవుతుందని నమ్మకం ఉంది.

**వాచ్, కర్చీఫ్**

వాచ్ సమయాన్ని తెలియజేస్తుంది. దాన్ని వేరే వాళ్లకు ఇస్తే మన జీవిత గమనంలో మార్పులు వస్తాయని నమ్ముతారు. కర్చీఫ్ మనలోని బాధలు, సంతోషాలను సూచిస్తుంది. వీటిని ఇతరులకు ఇవ్వడం వల్ల బంధాలు బలహీనపడే అవకాశం ఉందని భావిస్తారు.

**బూట్లు, చెప్పులు, కాలి మెట్టలు**

బూట్లు, చెప్పులు అపవిత్రంగా భావిస్తారు. ఇవి పంచడం శుభకరం కాదు. అలాగే కాలి మెట్టలు స్త్రీకి గృహస్త జీవితం గుర్తు. ఇవి పంచడం చెడ్డ ఫలితాలకు దారి తీయవచ్చు.

**గాజులుజి**

గాజులు కూడా ఒక వివాహిత జీవితంలో శక్తికి సంకేతం. విరిగిన గాజులను వేరొకరికి ఇవ్వడం వల్ల దాంపత్య సంబంధాలలో విభేదాలు రావచ్చు.

**నవజాత శిశువు బట్టలు**

పుట్టిన బిడ్డ బట్టలు చాలా పవిత్రంగా భావిస్తారు. ఇవి సున్నితమైన శక్తిని కలిగి ఉంటాయి. వీటిని వేరొకరికి ఇవ్వడం వల్ల ఆ శిశువు ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది.

**వివాహ దుస్తులు**

పెళ్లి వేళ ధరించే దుస్తులు జీవితంలో ఎంతో ముఖ్యమైనవి. ఇవి శుభ శక్తిని కలిగి ఉంటాయని నమ్మకం. ఇవి పంచడం వల్ల ఆ శక్తి ఇతరులకు బదిలీ అయ్యే అవకాశం ఉంది.

**మంగళసూత్రం**

మంగళసూత్రం ఒక మహిళకు వివాహ బంధాన్ని సూచించే పవిత్ర చిహ్నం. ఇది ఆమె జీవితంలో భద్రత, శాంతి, ఆనందానికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ మంగళసూత్రాన్ని ఇతరులకు ఇవ్వడం అశుభంగా పరిగణించబడుతుంది. ఇది దాంపత్య జీవితంలో కలతలు తెచ్చే అవకాశం ఉంది. ఇలాంటి విషయాల్లో జాగ్రత్త వహించడం వల్ల మన జీవితంలో శాంతి, ఆనందం నిలుస్తాయి.

## ఈ మూడు తప్పులను వదిలితేనే మనిషికి మోక్షం దొరుకుతుందట..!



శ్రీమద్ భగవద్గీతను కేవలం మత గ్రంథంగా కాదు.. మన జీవన విధానాన్ని మార్గనిర్దేశం చేసే అమూల్య గ్రంథంగా కూడా పరిగణిస్తారు. ఇందులో శ్రీకృష్ణుడు ఇచ్చిన బోధనలు ఈనాటి జీవితానికి కూడా అత్యంత ప్రాముఖ్యంగా వర్తిస్తాయి. గీతలో ఆయన మూడు ముఖ్యమైన దోషాలను పేర్కొన్నారు. ఇవి మన ఆత్మబలాన్ని తగ్గించి.. మనల్ని నరక మార్గంలోకి నడిపించే ప్రమాదం ఉందని చెప్పారు. భగవద్గీతలో కామం, కోపం, దురాశ అనే మూడు దోషాలు మనిషిని దిగజార్చే ద్వారాలుగా పేర్కొనబడ్డాయి. వీటి గురించి భగవద్గీత శ్లోకం (అధ్యాయం 16, శ్లోకం 21) ఇలా చెబుతుంది

**త్రివిధం నరకస్యేదం ద్వారం**

**నాశనమాత్మనః**

కామః క్రోధస్త లోభస్తస్మాదేతత్రయం త్యజేత్

అంటే ఈ మూడు దోషాలు (కామం, కోపం, దురాశ) నరకానికి తెరవబడే ద్వారాలే. కాబట్టి వీటిని వెంటనే వదిలేయాలి.

**కామం**

కామం అంటే సాధారణ కోరికలు ఎక్కువై, వాటిని ఎలాగైనా తీర్చుకోవాలనే బలమైన ఆలోచన కలగడం. ఈ కోరిక నెరవేరకపోతే మనసు లోతుల్లో అసంతృప్తి పెరుగుతుంది. ఆ అసంతృప్తి నుంచి మనిషి ఆత్మవిశ్వాసం కోల్పోతాడు. ఎప్పటికీ తీరని కోరికలు మనిషిని స్వార్థంతో నడిపిస్తాయి. స్వార్థం వల్ల ఇతరులకు హాని చేసే దిశగా అడుగులు వేస్తాడు. ఈ విధంగా కామం ఆత్మను కలుషితం చేస్తుంది.

**కోపం**

కోపం అనేది అంతరంగాన్ని కాల్చే అగ్ని. ఇది మొదట మనలోనే నాశనాన్ని ప్రారంభిస్తుంది. కోపంలో ఉన్న మనిషి సరైన నిర్ణయం తీసుకోలేడు. అతనికి నిజం, తప్పు మధ్య తేడా స్పష్టంగా కనిపించదు. కోపం వల్ల మన మాటల్లో కఠినత్వం, ద్వేషం పెరుగుతుంది. ఇది మన ఆధ్యాత్మిక జీవనంలో క్షీణతకు కారణమవుతుంది.

**దురాశజి**

దురాశతో ఉండే వ్యక్తికి ధనం ఎంత ఉన్నా సరిపోదు. అతనికి ఎప్పటికీ తృప్తి ఉండదు. ఇతరుల కంటే ధనం ఎక్కువగా కావాలని కోరుకుంటాడు. కొన్ని సందర్భాల్లో ధనం కోసం ధార్మిక పరిమితుల్ని దాటి పోతాడు. ఇది నెమ్మదిగా అతన్ని తప్పుడు మార్గాల్లోకి నడిపిస్తుంది. దురాశ వల్ల అతను పాపానికి లోనవుతాడు. శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పింది ఏంటంటే.. ఈ మూడు దోషాలను పూర్తిగా వదిలినపుడు మాత్రమే మనిషి మోక్షానికి చేరుకోగలడు. కామం, కోపం, దురాశను నియంత్రించడమే ఆత్మరక్షణకు మొదటి అడుగు. వీటిని నియంత్రించడం ద్వారా శాంతిని, లోతైన ఆనందాన్ని పొందవచ్చు. మన జీవితంలో భగవద్గీత బోధనలు పాటించడమే మన ఆత్మ అభివృద్ధికి సహాయపడుతుంది. ఈ మూడు దోషాల్ని పూర్తిగా వదిలి, ఆత్మ నియంత్రణతో జీవించాలంటే చక్కటి ఆలోచనలు, మంచి చర్యలు అవసరం. మనం ఈ మార్గంలో నడిచినప్పుడు జీవితం మంచి దిశలో నడుస్తుంది.

## 3నెలల్లోపు కొత్త పింఛన్లు అందజేస్తాం : పరిటాల శ్రీరామ్

- ధర్మవరంలో ఎంపీ పార్థసారథితో కలిసి పింఛన్ల పంపిణీ
- గత ప్రభుత్వంలో లాగా కమీషన్లు, అవినీతికి తావులేదు
- నేరుగా లబ్ధిదారునికి పథకం అందుతోంది: శ్రీరామ్
- ధర్మవరంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం: పార్థసారథి





**ధర్మవరం,జూన్01.అక్షర టైమ్స్:** వచ్చే 3నెలల్లోపు ప్రభుత్వం కొత్త పింఛన్లు అందజేస్తుందని.. ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. సోమవారం ఆయన పలు కాలనీల్లో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. పట్టణంలోని లక్ష్మీచెన్నేకేశవస్వామి ఆలయం పరిసరాల్లో జరిగిన పింఛన్ల పంపిణీలో శ్రీరామ్ తో పాటు హిందూపురం ఎంపీ పార్థసారథి కూడా పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్తూ వారు పింఛన్లు పంపిణీ చేశారు. ప్రతి నెల ఒ?కటవ తేదీన పింఛన్లు వస్తున్నాయా.. ఎవరైనా డబ్బు అడుగుతున్నారా.. వంటి అంశాల గురించి ఆరా తీశారు. ఎక్కడ డబ్బు అగడటం లేదని.. 1వ తేదీ ఉదయాన్నే ఇంటి వద్దకు వచ్చి పింఛన్లు అందిస్తున్నారని లబ్ధిదారులు తెలిపారు. ఈసందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పథకాల్లో పింఛన్ల పంపిణీ కూడా ఒకటి అన్నారు. ఎక్కడ లబ్ధిదారులకు ఇబ్బంది పడకుండా గత ప్రభుత్వంలో లాగా కమీషన్లు, మోసాలకు తావు లేకుండా పింఛన్లు అందిస్తున్నట్లు చెప్పారు. ఒకటవ తేదిన పింఛన్లు అందుకుంటున్న లబ్ధిదారులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఏ పథకమైనా సరే లబ్ధిదారునికి నేరుగా చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఎక్కడా అవినీతి, నిర్లక్ష్యానికి తావు ఉండదన్నారు. కొత్త పింఛన్లు కావాలని ఇప్పటికే చాలా మంది దరఖాస్తులు చేసుకున్నారని.. వచ్చే రెండు మూడు నెల్లలోనే మంజూరు చేస్తారన్నారు. మరోవైపు ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ ప్రమాణ స్వీకారం చేసిన రోజున పింఛన్ల మొత్తాన్ని పెంచిన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని అన్నారు. ఒక్క పింఛన్ల పంపిణీ కోసమే ప్రభుత్వం 45వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. ధర్మవరం పట్టణంలో 17వేల పింఛన్లు అందుతున్నాయని.. ఇందుకోసం రూ.6.80కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో లాగా కాకుండా నేరుగా లబ్ధిదారునికి 1వ తేదిన పింఛన్లు అందజేస్తున్నట్లు చెప్పారు. ధర్మవరంలో రోడ్ల సమస్యల గురించి ప్రజలు చెబుతున్నారని.. త్వరలోనే వీటి మరమ్మతులు చేస్తామని.. ఇతర సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. సూపర్ సిక్స్ హామీలన్నీ ఇప్పటికే అమలు చేశామని.. మిగిలిన వాటిని కూడా అమలు చేస్తామన్నారు. కొత్త పింఛన్లు కూడా త్వరలోనే మంజూరవుతాయని ఎంపీ పార్థసారథి అన్నారు.

## మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చొరవతో కదిరి గేట్ రైల్వే ఓవర్ బ్రిడ్జ్‌కు మరో ముందడుగు

- కదిరి గేట్ రైల్వే ఓవర్ బ్రిడ్జ్ (=ాఓబీ) నిర్మాణానికి అదనంగా రూ.2.60 కోట్ల మంజూరు
- నిర్వాసితులెవ్వరూ నష్టపోకూడదని మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చర్యలు
- మంత్రి సత్య కుమార్ యాదవ్ చొరవ ఫలితంగా 1.889 ఎకరాల భూసేకరణలో కీలక పురోగతి
- రూ.32.60 కోట్లతో కదిరి గేట్ రైల్వే ఓవర్ బ్రిడ్జ్ తొలి దశకు కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్



**ధర్మవరం,జూన్01.అక్షర టైమ్స్:** ధర్మవరం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చొరవతో ధర్మవరం కదిరి గేట్ రైల్వే ఓవర్ బ్రిడ్జ్ (=ాఓబీ) నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియల్లో మరో ముందడుగు పడినట్లు మంత్రి కార్యాలయం తెలిపింది. ధర్మవరం ప్రజలకు అత్యంత అవసరమైన మౌలిక సదుపాయాల్లో కదిరి గేట్ రైల్వే ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం ఒక ముఖ్యమైన అంశమని, గతంలో వివిధ కారణాలతో ఈ ప్రాజెక్టు ఆలస్యమైనప్పటికీ ప్రస్తుతం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా ముందుకు తీసుకెళ్తోందని పేర్కొంది. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో రైల్వే ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి సంబంధించి నిర్వాసితుల సమస్యలను పరిష్కరించి వారికి పూర్తి న్యాయం చేస్తానని మంత్రి సత్యకుమార్ యాదవ్, ప్రజలకు హామీ ఇచ్చారని, ఎన్నికల అనంతరం ఆ హామీ అమలుకు కార్యాచరణ ప్రారంభించి దశలవారీగా బాధితులకు న్యాయం చేస్తున్నారని మంత్రి కార్యాలయం వివరించింది. ముఖ్యంగా భూముల విలువలు పెరగడం, కోర్టు ఆదేశాల మేరకు భూసేకరణ ప్రక్రియలో మార్పులు చోటుచేసుకోవడం వల్ల నిర్వాసితులెవ్వరూ నష్టపోకూడదనే లక్ష్యంతో మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపింది. ప్రస్తుత మార్కెట్ విలువలకు అనుగుణంగా వారికి న్యాయమైన పరిహారం అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పేర్కొంది. ఈ ప్రాజెక్టు ప్రారంభ దశలో భూసేకరణ మరియు యుటిలిటీ మార్పుల కోసం రూ.20.30 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేయగా, అనంతరం భూముల విలువలు పెరగడంతో ఆ మొత్తాన్ని రూ.30 కోట్లకు పెంచినట్లు వివరించింది. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు భూసేకరణ ప్రక్రియలో అదనపు వ్యయభారం ఏర్పడటంతో మరో రూ.2.60 కోట్లు అదనంగా అవసరమైన నేపథ్యంలో మొత్తం ప్రాజెక్టు తొలి దశ పరిపాలనా వ్యయం రూ.32.60 కోట్లకు పెరిగినట్లు మంత్రి కార్యాలయం వెల్లడించింది. అలాగే మొత్తం 1.889 ఎకరాల భూసేకరణ ప్రక్రియలో భాగంగా 130 మంది భూ యజమానులు ఉండగా, ఇప్పటికే 98 మంది భూ యజమానులకు 1.141 ఎకరాలకు సంబంధించి సుమారు రూ.15.89/- కోట్లు పరిహారం చెల్లింపులు పూర్తిచేయడం జరిగిందని, మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చొరవతో మరో 27 మంది భూ యజమానులకు 0.582 ఎకరాలకు సంబంధించి సుమారు రూ.10,74,43,588/- కోట్ల పరిహారం జమ చేయడం జరిగిందని మంత్రి కార్యాలయం పేర్కొంది. ఇంకా కేవలం 0.166 ఎకరాల భూమి సేకరణ మాత్రమే మిగిలి ఉందని, ఆ భూసేకరణకు అవసరమైన అదనపు పరిహారం వ్యయంగా రూ.2.60 కోట్లు అవసరమైన నేపథ్యంలో నిర్వాసితులెవ్వరూ నష్టపోకుండా, ప్రస్తుత భూముల విలువలకు అనుగుణంగా వారికి పూర్తి న్యాయం జరిగేలా మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చొరవతో చర్యలు చేపట్టారని వివరించింది. ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం, నిర్వాసితులకు పూర్తి న్యాయం చేయడం, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం అనే లక్ష్యాలతో మంత్రి సత్యకుమార్ యాదవ్ ముందుకు సాగుతున్నారని, ధర్మవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి కొనసాగుతోందని మంత్రి కార్యాలయం పేర్కొంది. అభివృద్ధి, పారదర్శకత, ప్రజా సంక్షేమం అనే లక్ష్యాలతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడంలో కట్టుబడి ఉందని మంత్రి కార్యాలయం వెల్లడించింది.